క్లుప్తంగా

క్రీడలతో స్నేహభావం



పోటీలు ప్రారంభిస్తున్న సీపీ చంద్రశేఖర్‌రెడ్డి

రామగిరి: జేఎన్టీయూ మైదానంలో జరుగుతున్న పెద్దపల్లి పోలీస్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను బుధవారం సీపీ సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. అనంతరం సీపీని రామగిరి మండల పాత్రికేయులు సన్మానించారు. పెద్దపల్లి డీసీపీ రూపేశ్, గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు గిరిప్రసాద్, సారంగపాణి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ధూళికట్ట వాసికి ఆహ్వానం



రవి యాదవ్

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన కొండ రవియాదవ్‌కు జాతీయ సదస్సుకు హాజరుకావాలని కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వశాఖ నుంచి ఆహ్వానం అందింది. రవియాదవ్ చేసిన సామాజిక సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం 2015 జనవరి 12న జాతీయ అవార్డును అందించింది. అప్పటి నుంచి నిరంతరాయంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయన కృషిని గుర్తించిన క్రీడా మంత్రిత్వశాఖ.. ఈనెల 8న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వేదికగా జరిగే యూత్ ప్రవాసీ భారతీయ దివాస్ జాతీయ స్థాయి సదస్సుకు ఆహ్వానం పలికింది.

అయ్యప్ప స్వామి ఆలయంలో జీఎం ప్రత్యేక పూజలు



జీఎంను సత్కరిస్తున్న అర్చకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ఆర్జీ–2 జీఎం మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు విజయ రామ శర్మ స్వామి వారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గంట ప్రభాకర్ రెడ్డి, కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ నాయక్, రౌతు రమేష్, పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు సన్మానం



కబడ్డీ క్రీడాకారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఉడుత అరుణ మణి, మణికీర్తన అక్కా చెల్లెళ్లను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ కబడ్డీ క్రీడా పోటీల్లో ఇండియా తరపున పాల్గొని నేపాల్ క్రీడా జట్టుపై గెలిచిన సందర్భంగా గ్రామస్తులు సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వారిని ప్రోత్సాహించాలని , గ్రామస్తులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ సుముకం నిర్మల, ఉప సర్పంచ్ సుకేందర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రెయిన్ లిపి ప్రాముఖ్యత తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ఆంటోనీ

సుల్తానాబాద్: పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ప్రపంచ బ్రెయిలీ సందర్భంగా బ్రెయిన్‌లిపిపై అవగాహన కల్పించారు. పాఠశాలలో పిల్లలకు బ్రెయిలీ బాషా యొక్క ప్రాముఖ్యత గురించి పిల్లలకు వివరిస్తూ, చూపులేక పోతేపిల్లలు ఎంత ఇబ్బంది పడతారనేది పిల్లలకు ప్రత్యక్షంగా చూపిస్తూ యాక్టివిటీస్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మాటేటి సంజీవ్ కుమార్, కృష్ణప్రియ ,ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధే లక్ష్యంగా..

- ధర్మారంలో న్యాక్ సెంటర్ ఏర్పాటు
- త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభం
- నిరుద్యోగులకు స్వయం ఉపాధి శిక్షణ



న్యాక్ సెంటర్ ఏర్పాటు చేయనున్న భవనం

ధర్మారం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) కేంద్రాలు పని చేస్తున్నాయి. మన రాష్ట్రంలో,ఉమ్మడి జిల్లాలో ఉన్న న్యాక్ కేంద్రాలు ఇప్పటివరకు అనేక మందికి స్వయం ఉపాధి శిక్షణలిచ్చి, యువతకు ఉపాధి కల్పించాయి. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారంలో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకుని మండలానికి న్యాక్ సెంటర్‌ను మంజూరు చేయించారు. దీంతో స్థానిక యువతీయువకులకు ఉపాధి శిక్షణ లభించనుంది. ధర్మారం మండలంలోని ప్రగతి మండలి పరస్పర సహాయక పొదుపు సహకార సంఘం భవనంలోని పై అంతస్తులో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 18 నుంచి 45 ఏళ్ల లోపున్న యువతీ యువకులకు వివిధ వృత్తులపై ఈ సెంటర్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందిస్తారు. యువతీ, యువకులకు ఆసక్తి అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్, ప్లంబింగ్, తాపీ మేస్త్రీ, మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ, అల్లికలు, మగ్గం వర్క్స్ తదితర రంగాలలో 15 రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తారు. శిక్షణ కాలంలో ప్రతి రోజు రూ.300 చొప్పున 15 రోజులకు రూ..4500లు వారివారి బ్యాంకు ఖాతాలలో ప్రభుత్వం జమచేస్తుంది. శిక్షణ తర్వాత న్యాక్ ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తారు. ఈ శిక్షణ తీసుకునే వారు ఆధార్, లేబర్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ పోటోలు, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌లను జతపర్చాలి. మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో లేబర్ కార్డు ఉన్న వారికి సమాచారం అందించి దరఖాస్తులు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాలు ఉంటాయని అధికారులు తెలిపారు. మండలంలో న్యాక్ సెంటర్ ఏర్పాటు కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యాక్ సెంటర్ ఏర్పాటుతో ఉపాధి



ప్రభుత్వం న్యాక్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుండడంతో గ్రామాల్లోని నిరుపేద యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. శిక్షణ కాలంలో భృతి కూడ ఇవ్వటం సంతోషకరమన్నారు.మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో న్యాక్ సెంటర్‌ను మంజూరు చేయించటం హర్షనీయం.

– తిరుపతి, పైడిచింతలపల్లి

ఉపాధి అవకాశాలు కల్పించాలి



న్యాక్ సెంటర్‌లో వివిధ రంగాలపై శిక్షణ ఇచ్చిన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పిస్తే బాగుంటుంది. శిక్షణ తర్వాత ఎవ్వరు పట్టించుకోకపోతే శిక్షణ పొంది లాభం ఉండదు. ప్రభుత్వం న్యాక్ సెంటర్‌లో శిక్షణ పొందిన వారందరికి కనీసం ఎడాది పాటు ఉపాధి కల్పించాలి

– గంగాధర శ్రీనివాస్, ధర్మారం

దేశం గర్వించేలా ప్రభుత్వ పథకాలు

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు



యూనిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్

రామగిరి: తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశం గర్వించేలా ఉన్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. రామగిరి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆవరణలో మండలంలోని లొంకకేశారంకు చెందిన నలుగురు లబ్ధిదారులకు బుధవారం దళితబంధు యూనిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. దళితులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన వివరించారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి పెద్దపీట వేస్తూ వారి సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరెళ్ళి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీడీవో ఇనుముల రమేశ్, పూదరి సత్యనారాయణ గౌడ్, గంట వెంకట రమణా రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రహరీ నిర్మాణం ప్రారంభిస్తున్న నాయకులు

జూలపల్లి: మండంలోని వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సర్పంచ్ మాంకాళి తిరుపతి,మండల ఉపాధ్యక్షుడు మొగురం రమేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఉపాధి హమీ నిధులు రూ.6.3లక్షలు కేటాయించగా బుధవారం పనులను ప్రారంభించారు. హరితహరంలో నాటిన మొక్కలు,క్రీడామైదానం రక్షణకు ప్రహరీ నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో కృపాకర్‌రావు, రాములు, ఏఈ రాజ్‌కుమార్,కార్యదర్శి మౌనిక, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జ్యోతినగర్: నియోజకవర్గంలోని ప్రతీ గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో సింగరేణి సీఎస్సార్ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అభివృద్ధి పథంలో రామగుండం కార్పొరేషన్‌ను అగ్రగామిగా నిలిపేందుకు తనవంతుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం పట్టణ ప్రగతి, సీఎస్సార్, 14వ ఆర్థిక సంఘం, ఎస్సీ సబ్ ప్లాన్‌తో పాటు ఇతర నిధులతో ప్రజలకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రామగుండం: ఈజీఎస్‌లో కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగుతున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు ఉపాధిహామీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టు కార్మికులుగా కొనసాగుతుండడంతో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టైం స్కేల్ అమలు చేయించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సత్యనారాయణ, రమేష్, వెంకటేశ్, సంతోష్‌కుమార్‌, తిరుపతినాయక్, సుజాత, సుమలత, రమ్య తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని 45వ డివిజన్‌లో బుధవారం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీధుల్లో నడుస్తూ పర్యటించి, స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి అభినందన

కోల్‌సిటీ: గోదావరిఖనిలో బుధవారం ప్రైవేట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మార్కండేయకాలనీలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ల్యాబ్ టెక్నీషియన్లు వృత్తి నైపుణ్యంను మెరుగుపర్చుకోవడంతోపాటు ఐక్యంగా ఉండాలని, టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా గట్ల కుమార్, ప్రధాన కార్యదర్శిగా లంక సదయ్య, కోశాధికారిగా మేకల తిరుపతి, ఉపాధ్యక్షుడిగా గుమ్మడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎర్రొళ్ల ప్రదీప్, కార్యవర్గ సభ్యులుగా పలువురి ఎన్నుకున్నారు.కార్యక్రమంలో రామగుండం, గోదావరిఖని, ఎన్టీపీసీకి చెందిన ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌టెక్నీషియన్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నృత్య పోటీలకు విద్యార్థుల ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ: అంతర్జాతీయ నృత్యపోటీలకు పోటీలకు యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రవీందర్ రావు తెలిపారు. రాష్ట్ర స్థాయి గుస్సాడి నృత్య పోటీల్లో డప్పు రమేష్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిభ కనబరిచి జూలై 3, 4 5 తేదీల్లో అమెరికాలో నిర్వహించే తానా మహాసభలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అయితే అమెరికా పంపించడం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేదనారు. ఎవరైనా దాతలు సహాయ చేయదలసిన ఫోన్ నంబర్లు 9849484631, 7386014563 సంప్రదించవచ్చాన్నారు. లేదా బ్యాంక్ అకౌంట్ నంబర్,62052124059డబ్బులు పంపించాలని కోరారు.

దళితులకు రిజర్వేషన్ పకడ్బందీగా అమలు కావాలి

రామగుండం: అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన దళిత వర్గాల అభ్యున్నతికి కొనసాగుతున్న రిజర్వేషన్ వ్యవస్థను అధికార యంత్రాంగం పకడ్బందీగా అమలు చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బుసిపాక సంతోష్‌కుమార్ మహారాజ్ అన్నారు. బుధవారం పట్టణంలో పలువురు చేరిక సందర్భంగా మాట్లాడారు. దళితుల పేరుతో రిజర్వేషన్ పొంది మతమార్పిడులకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి రిజర్వేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ఉపాధ్యక్షుడుగా వేల్పుల నర్సయ్యను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో సమితి కార్పొరేషన్ అధ్యక్షుడు గంగాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంఘీక శాస్త్ర ప్రతిభ పరీక్ష

ముత్తారం: మండలకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో బుధవారం మండలస్థాయి సాంఘీక శాస్త్ర ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ నెల 7 న జిల్లా స్థాయిలో జరిగే సోషల్ టాలెంట్ టెస్ట్‌కు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్‌ఎం హైమావతి, పలువురు అభినందించారు.

విద్యార్థులకు సత్ప్రవర్తన, సంప్రదాయలు నేర్పించాలి



అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, పేరెంట్స్

కాల్వశ్రీరాంపూర్: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు సత్ప్రవర్తన, సంప్రదాయలు నేర్పించాలని తద్వారా విద్యార్థి దశ నుండే సామాజిక దృక్పథం అలవడుతుందని అందుకు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు దోహదం కావాలని టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమల్ల రాకేశ్ అన్నారు. కాల్వ శ్రీరాంపూర్‌లో క్రీసెంట్స్ విద్యాసంస్థల నేతృత్వంలో బుధవారం రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివెల్ కార్యక్రమానికి రాకేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ వంటకాలు ఆత్మీయతను, సాంప్రదాయలను ప్రతిబింబింపచేస్తాయని ఆరోగ్యానికి సైతం దోహదపడతాయని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ అన్నారు. తల్లి దండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శనం చేయాలని తద్వారా సామాజిక స్పృహతో ఎదుగుగతారని జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి అన్నారు. క్రమశిక్షణతోనే విద్యార్థులకు వినయం, విధేయత, విజ్ఞానం పెంపొందుతాయని ఎస్సై రాజవర్ధన్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, సర్పంచులు శ్రీదేవి, రవిందర్ రెడ్డి, సంగీత, రాణి, సుజాత, రస్పాండెంట్ ఆయాజ్, ప్రిన్సిపాల్ సయ్యద్ నజీర్, నాయకులు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ టైర్లు ఢీకొని జేఎల్ఎంకు గాయాలు



సంతోష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

రామగిరి: మండలం నాగేపల్లిలోని గోదావరిఖని, ముత్తారం ప్రధాన రహదారిపై వెళ్తున్న లారీ నాగేపల్లి గ్రామపంచాయతీ రోడ్డు వద్ద ఉన్న గుంతలో పడడంతో టైర్లు ఆకస్మాత్తుగా ఊడిపోయి ఇంటి ముందు నిలబడి ఉన్న జేఎల్‌ఎం బియ్యాల సంతోష్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న లారీ ఎడమ వైపు రెండు టైర్లు అకస్మాత్తుగా ఊడిపోయి వేగంగా వచ్చి సంతోష్‌ను ఢీకొనడంతో క్రిందపడిపోవడంతో తలకు, చాతీలో తీవ్ర గాయాలైయ్యాయి. గమనించిన స్థానికులు సంతోష్‌ను కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన దెబ్బ తగలడంతో లోపల రక్తం గడ్డ కట్టి పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పురుషోత్తమ దివ్య సందర్శించి వివరాలను నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

మంథని: మండలంలోని మల్లేపల్లి డిగ్రీ కళాశాల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన సావిత్రి అనే వృద్ధురాలు గాయపడింది. తన మనవడితో కలిసి ద్విచక్రవాహనంపై గోదావరిఖని నుంచి మంథని వస్తుండగా కళాశాల సమీపంలో ఉన్న గుంతలో వాహనంపై పడడడంతో అదుపుతప్పి వెనుక కూర్చున్న సావిత్రి పడిపోవడంతో గాయపడింది. గాయపడ్డ సావిత్రిని ఆస్పత్రికి తరలించారు.

ఇసుక లారీల పట్టివేత

మంథని: మండలంలోని వెంకటాపూర్ మానేరు నుంచి ఎఫ్‌సీఐకి అక్రమంగా తరలుతున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్లు తహసీల్దార్ బండి ప్రకాశ్ తెలిపారు. మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఇసుక లారీలను తనిఖీ చేయగా ఏలాంటి వే బిల్లులు లేవనన్నారు. పట్టుకున్న ఇసుక లారీలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు.

అట్రాసిటీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



సీపీని కలిసిన సాయి రామ్‌నాయక్

రామగుండం: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అట్రాసిటీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ పీసీఆర్, పీవోఏ యాక్ట్ జిల్లా కమిటీ సభ్యుడు భూక్య సాయి రామ్‌నాయక్ కోరారు. రామగుండం సీపీ చంద్రశేఖర్‌రెడ్డి త్వరలోనే బదిలీపై వెళుతుండడంతో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

24 గంటల భజన పూర్తి

సుల్తానాబాద్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేణుగోపాల స్వామి ఆలయంలో 24 గంటల అఖండ భజనహరి నామ సంకీర్తన కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఉదయం నుంచి భజన చేసేందుకు అమ్మగోదా వేణుగోపాల స్వామి వారి సంపూర్ణ అనుగ్రహం కరుణ కటాక్షములతో విజయవంతమైందని పూజారి శ్రవణ్ కుమార్ తెలిపారు. వావిలాల నుంచి శివ రామ కృష్ణ భజన బృందం, నీరుకుల్ల బృందాలు రావటం, వారి కీర్తనలు అందరినీ అలరించాయి. కార్యక్రమానికి రూప కల్పన చేసిన శ్రావణ్ కుమార్ – హరిణిలకు కృతజ్ఞతలు తెలిపారు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్

రామగిరి:మండలంలోని నాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు ప్రజ్ఞా ఫౌండేషన్ (నార్వే)ఫౌండర్ లక్ష్మీనారాయణ ఒక్కొక్కరికి రూ. 2వేల చొప్పున ఉపకార వేతనం అందించారు. నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనం అందించి చేయూత అందిస్తున్న లక్ష్మీనారాయణను ఎంపీపీ ఆరెల్లి దేవక్క, వైస్ ఎంపీపీ కాపరబోయిన శ్రీదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బొల్లంకొండ గిరిధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరూరా కేసీఆర్ కప్ క్రీడాపోటీలు

పెద్దపల్లిరూరల్: నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల 6 నుంచి 9 వ తేదీ వరకు వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయా మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి వివరాలను ఈనెల 10 లోగా పెద్దపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అప్పగించాలన్నారు. 12న క్రీడాకారుల సమక్షంలో డ్రా తీసి పోటీల తేదీలు ప్రకటిస్తామన్నారు.

ఉపసర్పంచులకు డిజిటల్ కీ లు పంపిణీ

జూలపల్లి: కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీలకు నేరుగా నిధుల వినియోగానికి సంబంధించిన డిజిటల్ కీలను బుధవారం ఉప సర్పంచులకు మండల పంచాయతీ అధికారి కిరణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పుల మహేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందజేసే నిధులను పారదర్శకంగా వినియోగించే అవకాశం కలిగిందన్నారు. ఉపసర్పంచులకు విధుల్లో భాగస్వామ్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప స్వామి దీక్షాపరులకు భిక్ష

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్ భిక్ష ఏర్పాటు చేసి వడ్డించారు. రమేశ్ జన్మదినం సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు పంపిణీ

జూలపల్లి: మీకోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు కొంజెర్ల వెంకటయ్య బుధవారం బహుమతులను అందజేశారు. మండల స్థాయిలో విజేతలు మేరుగు కారుణ్య,శ్రీవైష్ణవికి ఫౌండేషన్ తరపున డిక్షనరీలు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటయ్య నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరస్వతి,ఫౌండేషన్ చైర్మన్ మహేశ్,,రాజయ్య, వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మామిడితోట వేలం రూ.5లక్షలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామపంచాయతీకి చెందిన 22ఎకరాల మామిడితోటకు బుధవారం జీపీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. జూలపల్లికి చెందిన కాంట్రాక్టర్ రూ.5లక్షలకు వేలంపాటను పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చీకటి శైలజ,ఎంపీవో అనిల్ తెడ్డి,జీపీ కార్యదర్శి నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ బ్రాంచి కార్యదర్శిగా దామోదర్ రావు

రామగిరి: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఆర్జీ3, ఏపీఏ ఏరియా బ్రాంచి కార్యదర్శిగా జక్కుల దామోదర్ రావును నియమిస్తూ ఆ సంఘం అధ్యక్షుడు బి. వెంకట్రావ్ ఉత్తర్వులు జారీ చేశారు. బ్రాంచి కార్యదర్శిగా పని చేస్తున్న పి. స్వామి ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్న దామోదర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం దామోదర్‌రావు ఆర్జీ3 జీఎం తన్నీరు వెంకటేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎం వెంకటేశ్వర రావు దామోదర్ రావును శాలువాతో సన్మానించి అభినందించారు.

వైద్యాధికారిగా అమరేందర్ బాధ్యతలు స్వీకరణ

ముత్తారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా రాయిని అమరేందర్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వైద్యాధికారి వంశీకృష్ణ బదిలీపై వెళ్లగా, రెండు నెలల క్రితం ఇన్‌చార్జిగా షణ్ముఖ రెడ్డి వ్యవహరించారు. ప్రభుత్వం అమరేందర్‌ను ముత్తారం వైద్యాధికారిగా నియమించగా బాధ్యతలు చేపట్టారు. వైద్యాధికారికి సిబ్బంది స్వాగతం పలికారు.

మోడల్ అంగన్‌వాడీలో వేడుకలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ గ్రామ మోడల్ (ఆదర్శ) అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక జన్మదిన వేడుకలు, గర్భిణులకు సీమంతాలు, అన్నప్రాశన నిర్వహించారు. జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమల, పంచాయతీ కార్యదర్శి శ్యాం, ఏఎన్‌ఎం శిరీష, కారోబార్ పీతాంబర్, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

టీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) క్యాలెండర్‌ను జిల్లా విద్యాధికారి మాధవి బుధవారం సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, లక్ష్మారెడ్డి, నరేందర్, మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, అంజయ్య, రామ్మూర్తి, సంపత్‌రెడ్డి, శంకరయ్య పాల్గొన్నారు.

సమాచారం

8న జూలపల్లిలో మెగాహెల్త్ క్యాంపు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో ఈ నెల 8న సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మోగాహెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్ తెలిపారు. హెల్త్ క్యాంపులో 9 రకాల వైద్య పరీక్షలను చేయున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంపు హైదరాబాద్, కొత్తగూడెం ఆస్పత్రులను చెందిన వైద్యులచే వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

9న ఐటీఐ ఆవరణలో అప్రెంటిస్‌షిప్ మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్, టర్నర్, మిషినిస్ట్, మెకానికల్ డిజిల్, మెకానిక్ మోటార్ వెహికల్ ట్రేడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నర్సింహాచారి తెలిపారు.